

ఇంటింటికీ నల్లా కనెక్షన్

- మిషన్ భగీరథ సీఈ లలిత
- బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాల్లో పర్యటన
- భగీరథ పనుల పరిశీలన



బ్రహ్మగిరి గ్రామస్థులతో మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారులు

6

చలి పంజా



నవాబ్‌పేటలో మంచుకు రోడ్డు కనిపించక లైటు వేసుకొని వస్తున్న ద్విచక్రవాహనదారుడు



ఖిల్లాఘనపురంలో చలికి చాయ్ తాగుతున్న వృద్ధులు



పాలమూరులో కురుస్తున్న మంచు



చలికి గొంగడి కప్పుకున్న వృద్ధుడు

చలి పంజా విసురుతోంది. నాలుగు రోజులుగా తీవ్రత పెరగడంతో జనం గజగజ వణుకుతున్నారు. చీకటైతే చాలు తలుపులు, కిటికీలు మూసేస్తున్నారు. రెండు దుప్పట్లు కప్పుకున్నా చలి తగ్గడం లేదు. ఈనెల 14న 17 డిగ్రీలున్న కనిష్ఠ ఉష్ణోగ్రత మరుసటి రోజే 2.4 డిగ్రీలు పడిపోయి 15.6 డిగ్రీలు నమోదుకావడంతో జనం అల్లాడిపోతున్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యల్పంగా 14.1 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాంతో నగరంలో రాత్రి 8 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం ఏడు గంటలు దాటితే గానీ తలుపులు తెరచుకోవడం లేదు. మార్నింగ్ వాకర్స్ తగ్గిపోయారు. సూర్యుడు వచ్చాకే మార్నింగ్ వాకర్స్ వస్తున్నారు. చలికితోడు తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంచుతో వాహనదారులు లైట్లు వేసుకొని డ్రైవింగ్ చేస్తున్నారు

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు మహబూబ్‌నగర్/వనపర్తి



వనపర్తి జిల్లా కేంద్రంలో చలిలో మార్నింగ్ వాక్ చేస్తున్న పట్టణవాసులు



ఘనపురంలో చలికి మఫ్లర్స్ కప్పుకొని విధులకు వెళ్తున్న మహిళలు



ఖిల్లాఘనపురంలో చలిమంట కాచుకుంటూ..



ఖిల్లాఘనపురంలో రోడ్లు ఊడుస్తున్న కార్మికులు



పొగమంచు కమ్ముకున్న వనపర్తి పట్టణం



నవాబ్‌పేటలో మార్నింగ్ వాకర్స్



పాలమూరు జనరల్ ఆసుపత్రి వద్ద చిన్నారికి ఎండ కాపుతున్న మహిళ



ఖిల్లాఘనపురంలో చలికి బైక్‌పై స్వెటర్లు ధరించి వెళ్తూ..

పాఠశాల విద్యతోనే ఉన్నత చదువులకు పునాది

- కలెక్టర్ బదావత్ సంతోష్



మంగనూర్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్య ఉన్నత చదువులకు పునాదిగా నిలుస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లోని పాఠశాలలు, పీహెచ్‌సీలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఇప్పటి వరకు సబ్జెక్టుల వారీగా ఎంత మేరకు సిలబస్ పూర్తి చేశారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ ఎలా కొనసాగుతోందని ఆరా తీశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంఆర్ఐ బాలరాజు, జీహెచ్‌ఎం నరసింహ తదితరులు ఉన్నారు.

ఈ ఎస్‌వో మాకొద్దు

- ఉన్నతాధికారులకు కస్తూర్బా విద్యార్థుల లేఖ
- విచారణ చేపట్టిన మల్దకల్ మండల విద్యాధికారి
- అరోపణలు అవాస్తవం : ఎస్‌వో గోపిలత

6

రైతులకు అన్యాయం జరిగితే సహించం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తివేయాలి
- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- పత్తి మిల్లు వద్ద రైతులతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



తర్నికల్ సమీపంలోని మిల్లు వద్ద పత్తిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ సమీపంలోని ఓ పత్తి మిల్లు వద్ద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసర కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. రైతులతో కలిసి మిల్లువద్ద ఉన్న పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని కొనాలనే నిబంధన ఎత్తివేయాలని, మద్దతు ధర రూ.8,110 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మునిసిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచోటి శ్రీశైలం, బీఆర్ఎస్ నాయకులు కొండూరు గోవర్ధన్, విజయ్‌గౌడ్, సూర్యప్రకాశ్‌రావు, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28 ఏళ్లైనా ఇంటి స్థలం చూపలేదు

- మూడేళ్లుగా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్న లబ్ధిదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిరుపేదల ఆశలు



పట్టాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలు

అమరచింత, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంలో అమరచింత మండల కేంద్రంలో నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు ఇచ్చి ఇప్పటికీ 28 ఏళ్లైనా స్థలం చూపడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రస్తుత మంత్రి వాకిటి శ్రీహరి అర్హులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేటికీ తమ సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం మారింది తప్పా మా సమస్యను పరిష్కరించడం లేదని వారు వాపోతున్నారు.

300 మందికి పట్టాలు

ఉమ్మడి రాష్ట్రంలో 1997 సంవత్సరంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి అమరచింత మండల కేంద్రంలోని సర్వే నెంబరు 586, 587 దుంపాయికుంటలో 14 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిరుపేదలకు ఇంటి స్థలం పట్టా అందించారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి రెండు సెంట్ల చొప్పున 300 మందికి ఈ పట్టాలు పంపిణీ చేశారు. ఇప్పటికీ 28 ఏళ్ల గడుస్తున్నా పొజిషన్ చూపలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని మూడేళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వివిధ సందర్భాల్లో జిల్లా, మండల స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చారు. అయినా ఎవరూ స్పందించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న వాకిటి శ్రీహరి కూడా అర్హులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కానీ నేడు ఆయన మంత్రి హోదాలో ఉన్నా లబ్ధిదారులకు మాత్రం స్థలాలు చూపించలేక పోవడం బాధాకరం అని లబ్ధిదారులు, మండల ప్రజలు వాపోతున్నారు.

అర్హులకు న్యాయం చేస్తా..



పేదలకు పట్టాలను ఇచ్చిన విషయం మా దృష్టిలో ఉంది. నిరుపేదలకు ఇచ్చిన మాట ప్రకారం వారికి న్యాయం చేసే విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. వారికి న్యాయం చేసే విషయంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అర్హులైన పేదలకు పొజిషన్ చూపిస్తాం.

- వాకిటి శ్రీహరి, పశుసంవర్ధక శాఖ మంత్రి

ఇంటి స్థలం చూపిస్తలేరు



28 ఏళ్ల క్రితం ఇల్లు కట్టుకోవడానికి పట్టాలు ఇచ్చారు. ఇప్పటికీ నా ప్లాట్ ఎక్కడుందో చూపించ లేదు. చాలాసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చాం. నేటికీ తమకు ఇంటి స్థలం చూపడం లేదు.

- మంజుల, పట్టా పొందిన లబ్ధిదారురాలు

ధాన్యం విక్రయిస్తే రశీదు ఇవ్వాలి

- అధికారులు, మిల్లర్లు రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్/వీపనగండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ధాన్యం విక్రయిస్తే రశీదు ఇవ్వాలని, అధికారులు మిల్లర్లు నిర్లక్ష్యంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తే సహించేది లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. పాన్‌గల్ కొనుగోలు కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే టప్పుడు తేమ శాతాన్ని పరిశీలించి తీసుకోవాలన్నారు. విక్రయించిన ధాన్యానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. అనంతరం పాన్‌గల్ నుంచి కదిరెపాడు వరకు రూ.3.10 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా మాధవరావుపల్లిలో ఇందిరమ్మ గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో గోవిందరావు, ఏపీఎం వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కేతేపల్లి రవి, వెంకటేష్ నాయుడు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలు చేయాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి 'ధన్ ధాన్య కృషి యోజన' పథకం అమలుకు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం అనుబంధ రంగాల్లో రైతులు సాంకేతికతను వినియోగిస్తూ మంచి ఆదాయి పొందాలన్నదే ప్రధాన మంత్రి 'ధన్ ధాన్య కృషి యోజన' లక్ష్యమని తెలిపారు. జిల్లాలో ఈ పథకం అమలుకు సంబంధిత అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, అడిషనల్ డీఆర్డీఏ శ్రీనివాసులు, ఏడీఏ సంగీతలక్ష్మి, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ ఉన్నారు.

ఐక్యత స్ఫూర్తితో.. అభివృద్ధికి బాటలు

- అదనపు కలెక్టర్ నర్సింగ రావు
- గద్వాల పట్టణంలో ఉత్సాహంగా ఐక్యత పాదయాత్ర



గద్వాల పట్టణంలో ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

గద్వాల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రతను కాపాడేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సహసాలు ప్రతినిత్యం మనందరిలోనూ ఐక్యత స్ఫూర్తిని రగిలిస్తున్నాయని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. అదే స్ఫూర్తితో దేశ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'ఏక్ భారత్ ఆత్మనిర్భర్ భారత్' నినాదంతో గద్వాల పట్టణంలో జిల్లాస్థాయి ఐక్యత పాదయాత్ర నిర్వహించారు. స్థానిక తేరు మైదానం వద్ద భరత మాత, వల్లభాయ్ పటేల్, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన ఐక్యత పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 560కిపైగా ఉన్న సంస్థానాలను ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానం విలీనం కోసం పటేల్ చూపిన చొరవ, ప్రదర్శించిన ధైర్యం దేశ సమగ్రత పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను ప్రపంచానికి చాటాయన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా నిర్మూలన, రాష్ట్రీయ ఏకతా దివస్‌పై విద్యార్థులు, యువతతో అదనపు కలెక్టర్ వేర్వేరుగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ఉమ్మడి జిల్లా అధికారి కోట నాయక్, గద్వాల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, పాదయాత్ర కమిటీ కన్వీనర్ బండల వెంకట్రాములు, కో కన్వీనర్ అనిల్‌కుమార్, రామాంజనేయులు, ఇతర అధికారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

ఉపాధ్యాయుల కోసం బడికి తాళం

- గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు విద్యార్థుల ధర్నా



పాఠశాలకు తాళం వేసి ధర్నా చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

7

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

- బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ ఎం. మద్దిలేటి
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్
- ఓవరాల్ చాంపియన్‌షిప్ కల్వకుర్తి ఎంజేపీ జట్టు

ఆన్‌లైన్‌లో నవోదయ హాల్ టికెట్లు

బిజినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు వట్టెం నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జానకీ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వట్టెం, బండమీది పల్లిలోని జవహర్ నవోదయ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నెంబర్‌తో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 13న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలకులకు వచ్చేనెల 11న శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటింటికీ నల్లా కనెక్షన్

- మిషన్ భగీరథ సీఈ లలిత
- బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాల్లో పర్యటన
- మిషన్ భగీరథ పనుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్రహ్మగిరిలో ఫిల్టర్ హౌస్‌ను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

బ్రహ్మగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ సీఈ లలిత అన్నారు. 'భగీరథుడు కరుణించేనా?' శీర్షికన ఈనెల 'ఆంధ్రజ్యోతి'లో 13న ప్రచురి తమైన కథనానికి అధికారులు స్పందించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని బ్రహ్మగిరి, కృష్ణగిరి, ఎడమ పాతాళగంగ గ్రామాలలో మంగళవారం సీఈ లలిత పర్య టించారు. మిషన్ భగీరథ అధికారులు, గ్రామస్థులతో కలిసి వాటర్ ట్యాం కులు, పైప్‌లైన్లను పరిశీలించారు. ఫిల్టర్ హౌస్ నుంచి ఇంటింటికీ సరఫరా అవుతున్న నీటిని పరీక్షించారు. కొన్ని కాలనీల్లో రంగుమారిన నీరు వస్తోందని స్థానికులు సీఈ దృష్టికి తీసుకురావడంతో, సమస్యను వెంటనే పరిష్కరించాల ని ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తామని చె ప్పారు. ఆమె వెంట మిషన్ భగీరథ ఈఈలు సధాకర్‌సింగ్, విజయశ్రీ, డీఈ హేమలత, ఏఈ రవి కుమార్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు బెజ్జం మల్లికార్జున్‌రా వు, మాజీ ఉపసర్పంచ్ బూదాల ప్రసాద్, రవికుమార్, సిరాజ్, దత్తు ముదిరా జ్, దావీద్ ఉన్నారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణ



గంట్రావుపల్లిలోని ఉన్నత పాఠశాల భవనం

పెద్దకొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏడేళ్ల క్రితం ఈ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు పవన్ జైన్ ఇంగ్లిష్ సబ్జెక్టు బోధిస్తాడు. రెండేళ్లగా విద్యార్థినులను చేతులతో తాకుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. రోజురోజుకు ఆయన ప్రవర్తన మితిమీరిపోవడంతో విషయం తల్లిదండ్రుల వరకు వెళ్లింది. దీంతో ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి తోటి ఉపాధ్యాయుల సమక్షంలోనే పవన్‌జైన్‌కు దేహశుద్ధి చేశారు. మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సాయంత్రం పాఠశాల వదిలాక కూడా సదరు ఉపాధ్యాయుడిని గ్రామస్థులు చితకబాదారు.

ఈ ఘటనపై మండల విద్యాధికారి పాఠశాలలో విచారణ జరిపి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు కొత్తకోట విద్యార్థి



జాతీయ స్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికైన రియాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శిరీష

కొత్తకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం లోని మైనార్టీ గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థి రియాజ్ జాతీయ స్థాయి అ థ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. సికింద్రా బాద్‌లోని జింఖానా స్టేడియంలో ఇటీవల జరిగిన 69వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పా ఠశాల విద్యార్థులు రియాజ్, అహ్మద్‌హుస్సేన్, ప్రకాష్, సంజయ్ కు మార్‌రెడ్డి, నసీర్ మియా పాల్గొన్నారు. వారిలో రియాజ్ లాంగ్‌జంప్‌లో ద్వితీ య స్థానం లో నిలిచి, వెండి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మధ్యప్రదేశ్ రా ష్ట్రంలోని ఇండోర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికయ్యాడు.

లా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : లా చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. యూనివర్సిటీలోని లా కళాశాలలో ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న వ్యాసరచన పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ లా పూర్తి చేసిన వారికి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చాలా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ మాలవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భూమయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపేద ఆడపడుచులకు
వైఎస్ఆర్ కానుక

- బాలింతలకు శిశు సంరక్షణ కిట్ల పంపిణీ
- అందులో రూ. 1,950 విలువైన వస్తువులు
- పాలమూరు మహిళలకు యెన్నం తోడ్పాటు



కిట్‌లో ఉండే వస్తువులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా వైద్య రంగంపై దృష్టి సారించారు. అందులో భాగంగానే నియోజకవర్గ ఆడపడుచులకు వైఎస్ఆర్ చిరు కానుక పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాన్పు చేయించుకున్న మహిళలకు వైఎస్ అర్ హెల్త్ కిట్‌ను అందించాలని నిర్ణయించారు. నవజాత శిశువు సంరక్షణకు రూ.1,950 విలువైన వస్తువులను ఉచితంగా అందించనున్నారు.

వైఎస్ఆర్ శిశు సంరక్షణ కిట్

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయిన మహిళలకు కేసీఆర్ కిట్ పేరుతో 16 రకాల వస్తువులను అందించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటినే ఎంసీహెచ్ కిట్ పేరుతో పంపిణీ చేసింది. అవి అయిపోయిన తర్వాత పథకం కొనసాగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలే దు. దీంతో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యె న్నం శ్రీనివాస్‌రెడ్డి ఆ పథకాన్ని పక్కన పెట్టి, తన సొంత నిధులతో వైఎస్ఆర్ హెల్త్ కిట్ (యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కిట్) పేరుతో పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గత శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

10 రకాల వస్తువులు

వైఎస్ఆర్ హెల్త్ కిట్‌లో మొత్తం 10 రకాల వస్తువులున్నాయి. నవజాత శిశువులకు సంబంధించిన స్లీపింగ్ బెడ్, దోమ తెర, టవల్, సాక్సులు, గ్లౌవ్స్‌లు, మఫ్లర్, బాడీలోషన్, బాడీ ఆయిల్, బేబీ సబ్బు, వైప్స్, డైపర్లు, ఒక జత దుస్తులు ఉన్నాయి. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ. 1,950 పలుకుతోంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఆడపడచులకు మాత్రమే ఈ కిట్‌ను అందించనున్నారు. ఆసుపత్రిలో ప్రతీ రోజు దాదాపు 30 నుంచి 40 కాన్పులు అవుతున్నాయి. వారిలో నియోజకవర్గానికి చెందిన వారు 10 నుంచి 15 మంది వరకు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. వారందరికి ఈ కిట్‌లు అందించనున్నారు.

4 రోజుల్లో 39 మందికి..

ఈ నెల 14 నుంచి వైఎస్ఆర్ హెల్త్ కిట్ పంపిణీ ప్రారంభమైంది. నాటి నుంచి ఇప్పటి వరకు 39 మందికి ఈ కిట్లను పంపిణీ చేశారు. ఈనెల 14న 12 మందికి, 15న 8 మందికి, 16న 10 మందికి, 17న 9 మందికి కిట్లను అందజేశారు.

ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా

- రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత



ఎమ్మెల్యే దంపతులతో పాటు కల్వ సుజాతను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అచ్చంపేటటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తానని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. అచ్చంపేట పట్టణ సమీపంలోని పల్కపల్లి శివాలయం ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్య వైశ్యులలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారికి కార్పొరేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. వైద్యులకు కమ్యూనిటీ భవ నాలు, మద్దిమడుగులో సత్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రెండు ఎకరాల భూమిని కేటాయించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులతో పాటు ఆమెను ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు.

అంతకుముందు ఆమె శ్రీరామ లింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాకమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యామ్‌సుందర్, సంఘం నాయకులు రామకృష్ణ, చంద్రకుమార్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం పెంపు

- అదనంగా మంజూరు కానున్న రూ.146 కోట్లు
- ఆర్థిక శాఖకు చేరిన ప్రతిపాదనల ఫైల్
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉదండాపూర్ ప్రజలు
- త్వరలోనే నిధులు మంజూరు : జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



ఉదండాపూర్ గ్రామం వ్యూ

జడ్చర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అదనపు పరిహారం అందనుంది. అందుకు ప్రభుత్వం నుంచి రూ.146 కోట్లు మంజూరు కానున్నాయి. గతంలో పునరావాస ప్యాకేజీ పెంచాలంటూ ముంపు గ్రామాల నిర్వాసితులు రిలేదీక్షలు చేపట్టారు. అంతకుముందే రూ.25 లక్షల పరిహారం ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వంపై కొట్లాడుతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. నిర్వాసితులకు పరిహారం పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం అందుకనుగుణంగా చర్యలు చేపట్టింది. అదనపు పరిహారం కోసం రూ.146 కోట్ల ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. తాజాగా ఆ పైల్ ఆర్థికశాఖకు చేరింది. ఆర్థికశాఖ ఆమోదం లభించిన వెంటనే కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. అనంతరం నిర్వాసితుల ఖాతాలలో డబ్బు జమ చేయనున్నారు.

రూ.25లక్షలకు పెంచాలని డిమాండ్ చేశా

ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు రూ. 25లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాను. ఈ మేరకు అదనంగా రూ.146 కోట్లు మంజూరు కానున్నాయి. పరిహారం పెంచాలని నిర్వాసితులు తనను అడగకపోయినా, వారి పక్షపాతిగా ఉన్నాను. రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు ఐదు తండాలవాసుల త్యాగం ఉంది. పరిహారం పెంచాలన్న డిమాండ్ త్వరలోనే నెరవేరనుంది.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

తాగునీటి కోసం రోడెక్కిన గ్రామస్థులు



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సక్ర మంగా రావడం లేదంటూ మండలంలోని యన్మగండ్ల కొత్తప్లాట్‌కు చెందిన మహిళలు మంగళవారం నవాబ్‌పేట, కారూర్ రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ గ్రామ నాయకుడు హమీద్ మహేక్ ధర్నా వద్దకు చేరుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

కాగా సాయంత్రానికి నీటిని విడుదల చేసినట్లు గ్రామ కార్యదర్శి సుష్మ తెలిపారు.

కలెక్టరేట్‌లో కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం



రామన్ గౌడ్ (ఫైల్)

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో ఓ కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం చేస్తున్న సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రామన్ గౌడ్ అనే కాంట్రాక్టర్ ఐడీవోసీలోని అదనపు కలెక్టర్ నివాస ఆవరణలో వాచ్‌మెన్ గది నిర్మించాడు.

ఇందు కోసం ఖర్చు చేసిన బిల్లులు రూ.4 లక్షలు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న రాలేదని సదరు కాంట్రాక్టర్ తెలిపారు. బిల్లులు రాకపోవడంతో మనస్థాపం చెంది మంగళవారం సాయంత్రం అదనపు కలెక్టర్ నివాసానికి దగ్గరలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు పేర్కొన్నారు.

సిబ్బంది అప్రమత్తమై నిప్పు అంటుకోకుండా అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం బిల్లులు చెల్లిస్తామని జిల్లా అధికారులు స్పందించినట్లు సమాచారం.

మల్లికార్జున ఖర్గేను కలిసిన
మంత్రి వాకిటి శ్రీహరి



బెంగళూరులో మల్లికార్జున ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాష్ట్ర క్రీడా, యువజన, మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం బెంగళూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. వైద్యులు ఇటీవల ఖర్గేకు పేస్ మేకర్ అమర్చిన సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తదితర అంశాలను ఖర్గేకు వివరించినట్లు మంత్రి తెలిపారు.

ఈ ఎస్‌వో మాకొద్దు

- ఉన్నతాధికారులకు కస్తూర్బా విద్యార్థుల లేఖ
- విచారణ చేపట్టిన మల్దకల్ మండల విద్యాధికారి
- ఆరోపణలు అవాస్తవం : ఎస్‌వో గోపిలత



గట్టు కస్తూర్బా విద్యాలయం

గట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ ఎస్‌వో మాకొద్దని జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ విషయం కలకలం సృష్టిస్తోంది. విద్యార్థినులతో పాటు, బోధనా సిబ్బంది కూడా ఉన్నతాధికారులను నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో కొందరు విద్యార్థినులు ఎస్‌వో టార్గెట్ చేసి వేధిస్తోందని లేఖల్లో పేర్కొన్నారు. బడిలోని ఓ గదిలో ప్రత్యేకంగా వంటకాలు చేయించుకుంటున్నట్లు ఆరోపించా రు. ఇటీవల పాఠశాల తనిఖీకి వచ్చిన కలెక్టర్ బీఎం సంతోష్‌కు కొందరు విద్యార్థినులు ఈ విషయాన్ని తెలిపారు. వారిని కూడా ఎస్‌వో ఇబ్బంది పెడుతోందని ఆ లేఖల్లో పేర్కొన్నారు. ఒక విద్యార్థినికి మార్కులు తక్కువగా వచ్చాయని, ఇంటర్‌లో సీటు కేటాయించకుండా ఇబ్బంది పెట్టిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఫిర్యాదులపై స్పందించిన ఉన్నతాధికారులు మల్దకల్ ఎంఈవో సురేశ్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన ఇటీవల పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తానని తెలిపారు.

ఎలాంటి తప్పూ చేయలేదు

నేను ఎలాంటి తప్పూ చేయలేదు. నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. నాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లిన విషయం తనకు తెలియదన్నారు. విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయి.

– గోపిలత, ఎస్‌వో

ప్రభుత్వ పరిధిలోకి బోధనేతర ఉద్యోగులు

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో చాలా కాలంగా పని చేస్తున్న బోధనేతర ఉద్యోగులకు తీపి కబురు అందింది. త్వరలోనే వారందరూ ప్రభుత్వ పరిధిలోకి రానున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి జీవోల ప్రకారం వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమకానున్నాయి. ఈ సందర్భంగా పీయూ ఫార్మసీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి బోధనేతర ఉద్యోగులు అటు కాంట్రాక్ట్ పద్ధతికి కానీ, ఇటు ఔట్ సోర్సింగ్ పరిధిలోకి కానీ రాలేదని తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీఓఆర్‌టీ 1626/2025తో ఐఎఫ్ఎంఐఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్‌ఫర్మేషన్) ప్రకారం రాష్ట్రంలోని బోధనేతర ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఖాతా నుంచే వేతనాలు అందనున్నాయి. అందుకోసం ప్రభుత్వం కోరిన విధంగా బోధనేతర సిబ్బంది వివరాలను పంపించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో సమానంగా వీరికి కూడా బెనిఫిట్స్ అందుతాయని తెలిపారు. అందుకు కృషి చేసిన విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, విద్యా కమిషనర్ దేవసేన, సందీప్ సుల్తానియా, ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్ జేడీ నాగేశ్వరావులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ప్రవీణ, ప్రిన్సిపాళ్లు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ మాలవి, డాక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో ఒక్క యూనిట్ ద్వారా 0.210 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 0.364 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎగువ కేంద్రంలో ఇప్పటివరకు 506.793 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో 498.876 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు తెలిపారు.

ఏసీబీ కి పట్టుబడ్డ విద్యుత్ ఏఈ



ఏసీబీ కి పట్టుబడ్డ ఏఈ హర్షవర్ధన్

గోపాల్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు విద్యుత్ ఏఈ పట్టుబడిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఏదుల మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం గోపాల్‌పేట మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) హర్షవర్ధన్ రెడ్డిని సంప్రదించాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు హర్షవర్ధన్ రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశాడు. రైతు అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ. 40 వేలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నాడు. మందుగా రూ. 20 వేలు ఇస్తానని, ట్రాన్స్‌ఫార్మర్ వచ్చాక మిగతా రూ. 20 వేలు ఇస్తామని రైతు చెప్పి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం గోపాల్‌పేటలోని అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో రైతు నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటున్న హర్షవర్ధన్‌ను పట్టుకున్నారు. ఏఈ ని బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు చెప్పారు. ఇదిలాఉండగా హర్షవర్ధన్‌కు రెండు రోజుల క్రితం మరో విద్యుత్ ఏఈ చెల్లితో ఒక కోటి రూపాయల కట్నంతో ఎంగేజ్‌మెంట్ ఘనంగా నిర్వహించారు.

క్రైం కార్నర్

భవన నిర్మాణ కార్మికుడి మృతి

గద్వాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పర్మాల సమీపంలోగల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణం కొనసాగుతోంది. వెంకటేశ్ (36) అనే కార్మికుడు అక్కడ పని చేస్తూ, ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు నదీ అగ్రహారానికి చెందిన వ్యక్తి అని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని స్థానికులు తెలిపారు.

బావిలో పడి మహిళ...

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న చొక్కమ్మ బావిలో పడి గుర్తుతెలియని మహిళ(35) మృతి చెందింది. ఆమె వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచినట్లు వైద్యాధికారులు తెలిపారు.

రైలులో నుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం

మహబూబ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలులోంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం కర్నూలు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న హంద్రీ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి దివిటిపల్లి బ్రిడ్జి దగ్గర గుర్తుతెలియని వ్యక్తి (25) జారిపడి కింద పడి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మద్యం మత్తులో మురుగు కాలువలో పడి..


మాబాష (ఫైల్)

అయిజ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తి మురుగుకాలువలో పడి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. పట్టణంలోని నర్సింహకాలనీకి చెందిన మాబాష (44) సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్తూ, రాఘవేంద్ర కాలనీలోని ఓ మురుగుకాలువలో పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం అతడిని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతడికి భార్య, కుమారుడు, ముగ్గురు ఉమార్తెలు ఉన్నారు. సంఘటనపై భార్య రహెమత్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి బలవన్మరణం

లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి శంకర్(32) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్ మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా, పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై లింగాల ఎస్ఐ వెంకటేశ్వర్లు గౌడ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినిని ఢీకొన్న బైక్

» తలకు తీవ్ర గాయం


గాయపడిన విద్యార్థినికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న విద్యార్థినిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చర్లతిర్మలాపురం గ్రామానికి చెందిన హేమలత సాయంత్రం ప్రధాన రహదారిని దాటుతుండగా, వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొన్నది. బాలిక తలకు తీవ్ర గాయం కావడంతో ట్రాఫిక్ పోలీసులు 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. రక్త స్రావం అధికం కావడంతో బాలికను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు వైద్యులు సూచించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

గండీడ్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండలం కొండాపూర్ గేటు వద్ద ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొండాపూర్ గ్రామానికి చెందిన గొల్లరాజు, బల్సూర్‌గొండ గ్రామానికి చెందిన వెంకటయ్యలు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వస్తూ కొండాపూర్ గేటు వద్ద ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడటంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు


ఎండి రఫీక్

చిన్నచింతకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని పెద్దవడ్డెమాన్ గ్రామానికి చెందిన ఎండీ రఫిక్ అనే వ్యక్తి అదృశ్యం అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16న మిరపకాయలు కొట్టించుకొని వస్తానని రఫిక్ తన భార్య తస్లీమ్ బేగంతో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెల్ల రంగు గళ్ల చొక్కా, నల్లని ప్యాంటు ధరించాడని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

50 క్వింటాళ్ల పత్తి దగ్ధం

» లక్ష ఇరవై వేల ఆస్తి నష్టం


కొంకనివానిపల్లెలో కాలి బూడిదైన పత్తి

అమరచింత, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేతికొచ్చిన పత్తి పంటను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని కొంకనివానిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ స్వాతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటన్న రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇటీవల పత్తి తీసి పొలంలో నిల్వ చేయగా, మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. చుట్టు పక్కల వారు గమనించి వెంకటన్నకు సమాచారం అందించగా, అతడు అక్కడికి చేరుకొనే సరికే పత్తి పూర్తిగా కాలిబూడిదయ్యింది. దీంతో రూ. 1.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు అతడు తెలిపాడు. సమాచారం అందుకున్న సీఐ శివకుమార్, ఎస్ఐ స్వాతిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

- ప్రతీ ఊరిలో ఇంటింటికీ మరుగుదొడ్ల ఏర్పాటు
- 2012 నుంచి 2014 వరకు ఎన్‌బీఏ పేరిట నిర్మాణాలు
- నేటి నుంచి అవగాహనా కార్యక్రమాలు
- నేడు అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం


సల్లోనిపల్లిలో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని మహిళలకు బొట్టు పెడుతున్న అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్/నారాయణపేట/ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని స్వతంత్రానికి పూర్వం నుంచే గ్రామాల పారిశుధ్యంపై మహాత్మాగాంధీ ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో 1930లో టోటల్ శానిటేషన్ క్యాంపెయిన్ (టీఎస్‌సీ) నిర్వహించారు. 2012 నుంచి 2014 వరకు (ఎన్‌బీఏ) నిర్మల్ భారత్ అభియాన్ పేరిట కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

48 గంటల్లో 271 మరుగుదొడ్లు

మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని సల్లోనిపల్లిలో 2016లో అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రాస్ ఆధ్వర్యంలో అద్భుతం సృష్టించారు. జిల్లాలోని 16 మండలాలకు చెందిన 16 మంది అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. 48 గంటలలో 271 మరుగుదొడ్లను నిర్మించారు. యుద్ధప్రాతిపదికన చేపట్టిన ఈ కార్యక్రమంపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని చాలా గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి (ఎస్‌బీఎం) స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ 12,500 చెల్లించారు. ఈ మిషన్ ద్వారా జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 1,15,224 ఇళ్లలో 82,487 మరుగుదొడ్లను నిర్మించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 98.98కోట్లు చెల్లించింది. ఇంకా లబ్ధిదారులకు రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోంది. ఆ ఇళ్లలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం 215 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వాటిలో 103 నిర్మాణం పూర్తయ్యాయి. మరో 112 నిర్మాణ దశలో ఉన్నాయి.

నిర్మించుకోని 7 శాతం ప్రజలు

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంకా 7 శాతం ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోలేదని అధికారుల గణంకాలు తెలుపుతున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఈ సంఖ్య గణనీయంగానే ఉందని చెప్పవచ్చు. మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ ఆదేశం మేరకు గ్రామాల్లో ఈ నెల 19 నుంచి వచ్చేనెల 10 వరకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంతో లాభాలు, లేకపోతే ఎదురయ్యే నష్టాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, సామాజిక కార్యకర్తలతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తారు.

పరిశుభ్ర గ్రామాలకు అవార్డులు



అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ గ్రామాలకు పురస్కారాలు అందించనున్నారు. అందుకు జిల్లాలోని ప్రతీ మండలం నుంచి 3 గ్రామాలను ఎంపిక చేస్తారు. 16 మండలాల్లో ఎంపిక చేసిన 48 గ్రామాల్లో నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా ప్రథమ, ద్వితీ, తృతీయ అవార్డులు, ప్రోత్సహకాలు అందిస్తారు. వాటితో పాటు ప్రతీ మండలం నుంచి కమ్యూనిటీ శానిటేషన్ విభాగంలో 2 గ్రామాలను ఎంపిక చేస్తారు. వాటిలో జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన 3 గ్రామాలకు ప్రోత్సాహకాలు అందిస్తారు.

- భాగం నిఖిలశ్రీ, డీపీవో, మహబూబ్‌నగర్


మాగనూర్ మండలం అడివిసత్యారంలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు

పేట జిల్లాలో 66,709 వ్యక్తిగత మరుగుదొడ్లు

నారాయణపేట జిల్లాలోని 13 మండలాలకు 272 గ్రామ పంచాయతీలు ఉండగా, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 66,709 వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించారు. లబ్ధిదారులకు రూ. 80.05 కోట్లు చెల్లించారు. ఇంకా రూ. 3 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉన్నది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,27130 నివాసాలున్నాయి. జిల్లాలో 4,443 మరుగుదొడ్ల నిర్మించాల్సి ఉన్నట్లు పంచాయతీ శాఖ అధికారులు స్వచ్ఛభారత్ మిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రతిపాదనలు పంపించారు. 2018లో నారాయణపేటను బహిరంగ మల విసర్జన రహిత మునిసిపాలిటీ (ఓడీఎఫ్)గా ప్రభుత్వం గుర్తించింది. అయినా పట్టణంలోని పళ్ల, హరిజన్‌వాడ, జంగిడిగడ్డ, బహార్‌పేట్, సుభాష్‌రోడ్, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కొందరు బహిర్భూమికి వెళ్తున్నారు.

పారదర్శకంగా క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ ఉషారాణి..


వాలీబాల్ విజేతగా నిలిచిన నవాబ్‌పేట బాలుర జట్టు

- ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ ఉషారాణి
- అండర్-14 వాలీబాల్స్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర సెక్రటరీ ఉషారాణి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల, బాలికలకు టోర్నమెంట్ కమ్ సెలక్షన్ నిర్వహించారు. పోటీలను డీఈవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు దాదాపు 500 మంది విద్యార్థులు హాజరైయ్యారు. బాలుర విభాగంలో విజేతగా నవాబ్‌పేట్, రన్నర్‌గా మహబూబ్‌నగర్, బాలికల విభాగంలో విజేతగా బాలనగర్, రన్నర్‌గా మహ్మదాబాద్ నిలిచాయి.

విజేతలకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి, రిటైర్డ్ పీడీ చెన్నవీరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచందర్, రాములు, ముస్తఫా, మోయిన్, అబ్దుల్లా, కృష్ణ, రవికుమార్‌గౌడ్, శంకర్, రాంకళ్యాణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు గురుకుల విద్యార్థి


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన హంజేఫ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మహబూబ్‌నగర్ మైనారిటీ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి మహ్మద్ హంజేఫ్ ఎంపికయ్యాడు. రంగారెడ్డి జిల్లా, హయాత్‌నగర్‌లో నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్‌సమీ, పీడీ గులాం అఫ్రోజ్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి విజేతగా నిలువాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ పోటీలు


రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మక్తల్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయి జయంతిని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా, మక్తల్‌లో మంగళవారం పది కిలోమీటర్ల రోడ్‌స్పీడ్ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను రిటైర్డ్ పీఈటీ గోపాలం, సత్యసాయి సేవా సమితి ప్రధాన కార్యదర్శి భాస్కర్ ప్రారంభించారు. మొత్తం 120 మంది బాలురు పోటీల్లో పాల్గొన్నారు. 14 ఏళ్ల విభాగంలో భరత్, బాలకృష్ణ, అంజనేయులు, అజయ్, శ్రీహరి, 17 ఏళ్ల విభాగంలో నరేందర్, గురుచరణ్, రోహిత్, మంజునాథ్‌లు విజేతలుగా నిలిచారు. వారు వచ్చేనెల 2వ వారంలో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు.

విజేతలకు ఈ నెల 23న సత్యసాయి మందిరంలో బహుమతులు అందించనున్నట్లు గోపాలం తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు దామోదర్, వెంకటేశ్, మహేశ్, గోపాల్‌గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

- బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ ఎం. మద్దిలేటి
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్
- ఓవరాల్ చాంపియన్‌షిప్ కల్వకుర్తి ఎంజేపీ జట్టు


ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న కల్వకుర్తి జట్టుతో బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ ఎం.మద్దిలేటి, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగమణి

కల్వకుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర బీసీ గురుకులాల జాయింట్ సెక్రటరీ ఎం.మద్దిలేటి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకులంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 స్పోర్ట్స్ మీట్ మంగళవారం ముగిసింది. పోటీల్లో 16 బీసీ బాలికల గురుకులాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కల్వకుర్తి ఎంజేపీ బీసీ బాలికల జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నాగమణి అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నాగమణి మాట్లాడుతూ కల్వకుర్తి బాలికల బీసీ గురుకులం విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో పీడీ సింధూజ, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం బడికి తాళం

» గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు విద్యార్థుల ధర్నా


పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పదర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇప్పలపల్లి, గానుగుపెంట గ్రామాలకు కలిపి ఒకే పాఠశాల ఉందన్నారు. 110 మంది విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ఎస్‌జీటీలు ఉన్నారు. వారిలో ఇద్దరు సెలువులో ఉన్నారు. మరో ఇద్దరిని సర్దుబాటు నెపంతో మద్దిమడుగు, మారడుగు పాఠశాలలకు కేటాయించారు. ఒకరు అనారోగ్యంతో సెలవు పెట్టారు. మిగిలిన ముగ్గురు మంగళవారం బడికి రాలేదు. దీంతో దీంతో తల్లిదండ్రులు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం పాఠశాలకు తాళం వేసి, గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకుడు బద్రీనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ రమావత్ సేవ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు పరిమితులు వద్దు

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


మిల్లు ఎదుట పత్తి రైతులతో కలిసి ఆందోళన చేపట్టిన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

మూసాపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తిని పరిమితులు, నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలంలోని ఎస్ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 క్వింటాళ్ల పరిమితితో రైతులు నష్టపోతున్నారన్నారు. అడ్డగోలు కొర్రీలతో ఇబ్బంది పెట్టకుండా రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఆందోళనలో బీఆర్ఎస్ పెద్దమందడి మండల అధ్యక్షుడు వేణుయాదవ్, అడ్డాకుల సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, ఖాజాగోరి, శ్రీధర్, బొడ్డు రమేశ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

WANTED

Universal Central School, Mahabubnagar, is looking for well - experienced Incharges and English/Mathematics faculty to teach Classes I to V. Requirements: Lady teachers only, Strong English - medium background, Relevant teaching experience Salary: 20,000 - 25,000 (based on experience) Interested candidates may contact immediately: 9010133022

AJJ:

3+1 Scheme
ప్రతి 4లైన్లకు
200/- రూ.
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో..



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా:	8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏమైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

ఇంటర్వ్యూ..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కృష్ణయ్య, ఎంపీడీవో, ఊర్కొండ



ఊర్కొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలో నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయని, వాటికి ప్రభుత్వం బిల్లులు చెల్లించిందని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయి ?

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ గృహాలు 287 మంజూరయ్యాయి.

ఇళ్లు ఏయే దశల్లో నిర్మాణంలో ఉన్నాయి ?

మండలంలో ఇందిరమ్మ గృహాలు బెస్‌మెంట్ లెవల్-175, రూఫ్ లెవల్-48, స్లాబ్ పూర్తి అయినవి-12, బీలో బెస్‌మెంట్-25 ఉన్నాయి.

ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు బిల్లులు అందాయా ?

మండలంలోని ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు సుమారుగా రూ.కోటీ 20లక్షల అందజేశాం.

ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఏమైనా సూచనలు చేస్తారా ?

ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు 27 మంది వరకు ఇంకా ప్రారంభించలేదు. అటువంటి వారు త్వరితగతిన ప్రారంభించి లబ్ధి పొందాలని సూచిస్తున్నాం. పనులు ఎంత తొందరగా పూర్తి చేసుకుంటే బాగుంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే గ్రామాల వారీగా రెండవ దశ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులను గుర్తించి జాబితాను తయారు చేస్తాం.

న్యూస్ బాక్స్

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరం దాదాపు పూర్తయినప్పటికీ ఇంకా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పెద్ద సమస్యగా మారిందని, తక్షణమే ఉపాధ్యాయుల కొరత సమస్యను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కృష్ణ, ఎం.శ్రీధర్‌వర్మ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు చాలా అసంబద్ధంగా ఉందని, అచ్చంపేట, కొల్లాపూర్ డివిజన్‌లలో పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి హైదరాబాదు సమీప మండలాలకు వివిధ ప్రాబల్యాల మేరకు డిప్యుటేషన్లపై పంపించాలని పేర్కొన్నారు. వీటిపై టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలు మార్లు డీఈవో దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

వెల్దండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్‌మన్, మోడల్ స్కూల్‌లో హెడ్ కుక్‌లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో చంద్రుడు కోరారు. పదవ తరగతి చదివి, 18 ఏళ్లు పైబడిన అభ్యర్థులు ఈనెల 20 వరకు తమ దరఖాస్తులను కేజీబీవీ ఎస్‌వోకు ఇవ్వాలని సూచించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

వెల్దండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి మంగళవారం వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి సెల్‌ఫోన్ అప్పగించారు. ఇటీవల సర్కిల్ పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన నరేందర్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుని నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీఈఐఆర్ యాప్ సహాయంతో ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పగించారు. సీఐ వెంట క్రైం కానిస్టేబుల్ అంజినాయక్ ఉన్నారు.

మంటలు చెలరేగి కారు దగ్ధం

- కారుదిగిన ఐదుగురు వ్యక్తులు సురక్షితం

అచ్చంపేట/ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐదుగురు వెళ్తున్నకారులో ఆకస్మికంగా మంటలు రావడం, అందులోని వారు కిందకు దిగడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన అచ్చంపేటమండల ఐనోలు గ్రామసమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. దేవరకొండ నుంచి మద్దిమడుగు దైవదర్శనానికి ఐదుగురు వ్యక్తులు మంగళవారం కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఐనోలు చౌరస్తాకు చేరుకునే సరికి కారు రేడియేటర్‌నుంచి పొగలు వ్యాపించాయి. కారు అగ్ని ప్రమాదానికి గురవుతుందేమోననే భయంతో కారులోని ఐదుగురు వ్యక్తులు కిందికి దిగారు. కారును రహదారి పక్కనే నిలిపివేసి వెళ్లినట్లు తెలిసింది. స్థానిక ఎస్‌ఐ సద్దాం హుస్సేన్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కారు, ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మన్ననూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పై కారు, ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మన్ననూరు గ్రామానికి చెందిన లాలు నాయక్ తన ఆటోలో శ్రీశైలం వైపు వెళుతున్న క్రమంలో, గ్రామ సమీపంలోని అరణ్య రెస్టారెంట్ వద్ద రహదారిపై ఎదురుగా వస్తున్న కారు, ఆటోను ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ లాలు నాయక్‌కు తీవ్ర గాయాలవగా, చికిత్సనిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారును అమ్రాబాద్ ఠాణాకు తరలించి పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

డ్రగ్స్ వాడకం ఎంతో చేటు

- నషా ముక్తి భారత్ అభియాన్ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలు



మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అధికారులు

నాగర్‌కర్నూల్/ కందనూలు/ కొల్లాపూర్/ లింగాల/ తెలకపల్లి/ ఉప్పునుంతల/ తాడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల



మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పోలీసు సిబ్బంది

వినియోగం వల్ల సమాజానికి, కుటుంబానికి, వ్యక్తిగత జీవితానికి ఎంతో చేటని, డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నషాముక్తి భారత్ అభియాన్ ముగింపు కార్యక్రమం సందర్భంగా మంగళవారం జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా విభిన్న ప్రతి భావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలన్నారు. జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ సెంటర్ ద్వారా అవగాహన కల్పిస్తూ మత్తు విముక్తికి వైద్యం అందిస్తుందన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల బారిన పడిన వారు ఉంటే డీ అడిక్షన్ సెంటర్‌కు తరలిరావాలని కలెక్టర్ సూచించారు. ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన మత్తుపదార్థాలు, డ్రగ్స్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంత విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నదని, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అంటూ అందరితో నినాదాలు చేయించి మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, బీసీ వెల్ఫేర్ అధికారి యాదగిరి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఫిరంగి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ నరహరి, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఉదయ్, డాక్టర్ శ్రీకాంత్, పరిపాలన విభాగపు సహాయ సంచాలకులు సీజే.వసంత్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై ప్రతిజ్ఞ చేయించారు.

● ఎస్పీ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఏఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్‌రావు, ఎస్‌బీఐ కనకయ్య, ఆర్‌ఐ జగన్, ఏవో కృష్ణయ్య, సీసీ బాలరాజు, జిల్లా ఆర్మ్ రిజర్వ్ సిబ్బంది, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై సీఐ మహేష్ అవగాహన కల్పించారు. ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ భరత్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌లు పాల్గొన్నారు. ● కొల్లాపూర్‌లో మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలోనూ పట్టణంలో డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

● లింగాల జడ్పీహెచ్ పాఠశాలలో డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించగా, ఎస్‌ఐ ఏ.వెంకటేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

● తెలకపల్లిలోని సిద్ధార్థ మోడల్ స్కూల్, సీఎల్ ఆర్ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

● ఉప్పునుంతల జడ్పీహెచ్‌లో విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధంపై ఎస్‌ఐ వెంకటరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసురెడ్డి, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు.

● తాడూరులో ఎస్‌ఐ గురుస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన ప్రతిజ్ఞను చేయించారు.

గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలి

చారకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం వద్ద నిర్మించనున్న రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా భూ నిర్వాసితులు మంగళవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ అమరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భూ నిర్వాసితులు మాట్లాడుతూ 2016-17లో జరిగిన భూసేకరణ సర్వేను అధికారులు సక్రమంగా నిర్వహించలేదని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే ఎర్రవల్లి, ఎర్రవల్లితండా పూర్తిగా ముంపునకు గురవుతాయని, రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గిస్తే ముంపునకు గురికాదని విన్నవించినట్లు తెలిపారు.



అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ అమరేందర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయికుమార్, భూనిర్వాసితులు ప్రకాష్, బలరాం, నాగయ్య, పర్వతాలు, శేఖర్, రాజు, గోపి, దేవందర్, రెడ్యా, శ్రీను పాల్గొన్నారు.

మహిళల భద్రత షీటీం బాధ్యత

నాగర్‌కర్నూల్‌క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత షీటీం బాధ్యత అని సబ్ ఇన్‌స్పెక్టర్ రజిత అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కుమ్మెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, భరోసా, సఖి సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి విలువలతో కూడిన జీవన విధానం అలవర్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్‌ఐ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఏహెచ్‌టీయూ సభ్యులు, షీటీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చారకొండ, (ఆంధ్రజ్యోతి) : మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు



మాట్లాడుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ రజిత

అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మత్తు, గంజాయి, సోషల్ మీడియ వేధింపులకు గురైతే టోల్ ఫ్రీ నెం : 100, 112, 1930, 1098 సంప్రదించాలని షీటీం డివిజన్ ఇన్‌చార్జీ ఏ. వెంకట్‌స్వామి అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, ఎస్‌వో మంజుల, షీ టీం ఇన్‌చార్జి పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సివిల్ సప్లై హమాలీ కార్మికుల కోసం సమగ్ర చట్టం తేవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సివిల్ సప్లై హమాలీయూనియన్ సమావేశం నిర్వహించారు. చాలీచాలని వేతనాలతో సివిల్ సప్లై హమాలీలు అవస్థలు పడుతున్నారని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా నాయకులు బాలయ్య, బంగారయ్యపాల్గొన్నారు.

● బిజినేపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం అవరణలో మంగళవారం సీఐటీయూ మండల మహాసభ జరిగింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, జయమ్మ, జశ్వంత్, షైబు, శంకర్, రామకృష్ణ, సుభాష్, మహేష్, ఎల్లయ్య, రాములు, కుర్మయ్య పాల్గొన్నారు.

కేఎల్‌ఐ నీరు పొలాల మీదుగా పారకుండా అరికట్టాలి

తెలకపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి శివారులో కేఎల్‌ఐ ద్వారా వచ్చే నీరు పంట పొలాల్లోకి వస్తోందని, అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు. కేఎల్‌ఐ కాలువ ద్వారా వచ్చే నీరు పెద్దమ్మతండాకు రావడంతో పంట పొలాలు ఎక్కి పారుతున్నాయని, తద్వారా పంటలు మునిగి పండేపరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామిరెడ్డిపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాములు తదితర రైతులు విలేకరులతో మాట్లాడారు.



పొలాల్లోకి వచ్చిన కేఎల్‌ఐ నీరు

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెంట్లవెల్లి నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో డిఫ్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ మల్లేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు నరసింహనాయుడు, డీష్ రవి, కేశపోగుల శేఖర్, ల్యాబ్ రాము, ఆర్‌ఐ బాలకోటి నాయక్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : బీఎస్పీ

తెలకపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీఎస్పీ నాయకులు కోరారు. మంగళవారంతహసీల్దార్, ఎస్‌ఐలకు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని వినతి పత్రం అందజేశారు. బీఎస్పీ రాష్ట్ర మాజీ ఈసీ మెంబర్ పృథ్వీరాజ్, జిల్లా ఇన్‌చార్జి సి.కళ్యాణ్ మాట్లాడుతూ నడిగడ్డ రామగిరి గ్రామాలలో రాత్రి 10 దాటిన తర్వాత ట్రాక్టర్లు, టిప్పర్లతో దుందుభీ వాగు నుంచి అనుమతులు లేకున్నా ఇసుకను అక్రమ మార్గాల్లో తరలిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్, ఈసీ మెంబర్ నాగరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎస్‌ఐకి వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

23న రాజాపూర్‌లో సత్యసాయిబాబా జయంతి

కోడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న మండలంలోని రాజాపూర్ గ్రామంలో పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి మందిర సేవా సమితి కన్వీనర్ కన్నారెడ్డి నాగిరెడ్డి తెలిపారు. 22నఉదయం యజ్ఞం, వివిధ పూజా కార్యక్రమాల అనంతరం రాత్రి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 23న కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

మాచారంలో టీబీ పరీక్షలు

మన్ననూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మాచారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద టీబీ ముక్త భారత్ స్క్రీనింగ్ పరీక్షలను వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మొబైల్‌ఎక్స్‌రే యంత్రం ద్వారా 107 మందికి పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు వివరించారు. కార్యక్రమంలో మన్ననూరు వైద్యాధికారి డాక్టర్ దుగ్యాల సుధాకర్, డాక్టర్ భవితేజ, డాక్టర్ పవన్ కల్యాణ్, ఆరోగ్య పర్యవేక్షకులు మారతమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు కిష్టయ్య మృతి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జాతీయోన్నత పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.కిష్టయ్య (91) మంగళవారం మృతి చెందాడు. కిష్టయ్య అంత్యక్రియలు బుధవారం వారి స్వగ్రామంలో నల్లవెల్లిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు డి.రామచందర్ తెలిపారు. ఆయన మృతి పట్ల జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్, కార్యదర్శి అబ్దుల్లాఖాన్, కమిటీ సభ్యులు పుట్టపాగ మహేంద్రనాథ్ సంతాపం తెలిపారు.

కరాటేలో విద్యార్థి మణిరాజ్ ప్రతిభ

లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతోపాటు కరాటేలో శిక్షణ తీసుకుని రాణించాలని శ్రీకృష్ణ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ జస్టిస్ జోసెఫ్ అన్నారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న మణిరాజ్ అనే విద్యార్థి ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 16న జడ్చర్లలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ కరాటే లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో కటాస్ విభాగంలో ప్రావీణ్యం కనబరుస్తూ రజత పతకం సాధించాడు. మంగళవారం స్కూల్‌లో ఆ విద్యార్థిని సన్మానించా రు.

భజన పరుల ఆత్మీయ సమ్మేళనం

తెలకపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మార్కండేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి మండల స్థాయి భజనపరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భజనపరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలను విస్తృతపరచాలని అన్నారు. వక్తలు పత్తికొండ రామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులందరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. హిందూ జీవన విధానమే భారతదేశానికి ఆయుపట్టు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భజనప రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామంలో సామ కేశవులు అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ సీహెచ్.హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6న ఇంట్లో తండ్రీకొడు కులు ఘర్షణ పడగా ఆగ్రహానికి కొడుకు కౌశిక్ కర్రతో బలంగా కొట్టడంతో తండ్రి కేశవులు తీవ్ర గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య అంజమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువత జాతీయ స్థాయిలో రాణించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువత దేశ స్థాయిలో రాణించాలని, యువతీ, యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని సాయిగార్డెన్స్‌లో స్వామి వివేకానంద జయంతి నేపథ్యంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నర్సింగ్ కళాశాల, పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలను పరిశీలించారు. హీమోడ యాలసిస్ విధానంపై విద్యార్థిని షాహీన్ ఇచ్చిన ప్రజెంటేషన్ ఆయనను ఆకట్టుకుంది. పల్లెటూరి పల్లకిలో గేయానికి విద్యార్థులు చేసిన నృత్యాలను తిలకించి వారిని అభినందించారు.కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్, డీఈవో ఏ.రమేష్‌కు మార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవినాయక్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

నమూనా ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నమూనా ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని మండలాల ఎంపీడీవోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండి నిర్మించుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణసౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

రైతుకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు

తిమ్మాజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపోను ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు ఎరువులు అమ్మే దుకాణపు యజమానులకుసూచించారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాలను మంగళవారం ఆయన మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను, ఈపాస్ మిషన్‌ను, ఎరువుల గోదాములను ఆయన పరిశీలించి దుకాణపు యజమానులకు పలు సూచనలు చేశారు. నిషేధిత మందులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అంతకు ముందు మారేపల్లి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతు బీమా దరఖాస్తులను వెంటనే క్లెయిమ్ అయ్యేలా చూడాలని ఏఈవోలకు సూచించారు. ఏఈవోలు సాయిరాం, సాహిత ఉన్నారు.

ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తిమ్మాజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సెల్ సభ్యుడ ఏసీపీ శ్రీరామ్ ఆర్య అన్నారు. మండల పరిధిలోని ఆవంచ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మంగళవా రం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపించే సందేహాలను చూడవద్దని తెలిపారు. దివ్యాంగులైన విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా గుర్తించాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని కించపరిచే విధంగా ప్రవర్తిస్తే శిక్ష ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం అమృత, ఉపాధ్యాయ బృందం ఆయనను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

భ్రమరాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు



భ్రమరాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అచ్చంపేటటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని భ్రమరాంబిక ఆలయంలో ఆలయ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులు, అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ముందు కార్తీక దీపాలు వె లిగించి మొక్కులు తీర్చుకున్నారు.

దేవునితిర్మలాపూర్‌లో...

పెద్దకొత్తపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలోని శివాలయం ప్రాంణంలో భక్తులు, మహిళలు, పిల్లలు, పెద్దలు కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.సత్యం, ఆలయ పూజారి శేషాచారి, గ్రామపెద్దలు పుట్ట ఆంజనేయులు, పిల్లి వెంకటేష్, దుర్గం రాములు, పుట్ట శివ పాల్గొన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి పర్యటన

తాడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకునెల్లికుదురు గ్రామంలో గురువారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకుగాను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి హాజరవుతారని సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలోనే ధాన్యం కొనుగోళ్లు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు హాజరు కావాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం

తిమ్మాజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కిరాణ దుకాణపు యజమానులు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డికి రూ.60వేలు అందజేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటులో అందరూ భాగస్వాములు కావాలన్న పిలుపు మేరకు కిరాణ యజమానులు తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ సీసీఐ కెమెరాల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని, దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



ఎస్‌ఐకి నగదు అందజేస్తున్న కిరాణ దుకాణపు యజమాని

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్

అచ్చంపేటటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :ఈనెల 30న అచ్చంపేట పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నల్లమల ప్రాంతంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సారథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షంధాటికి కోతకు గురైన రోడ్డు

అచ్చంపేటరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మొంథా తుఫాన్ వర్షాలకు కొట్టుకుపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. రోజుకు వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. రాత్రుళ్లు ప్రయాణిస్తే అంతే సంగతని, ఇకనైనా అధికారులు రోడ్డును మరమ్మతులుచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కోతకు గురై గొయ్యిలా మారిన రోడ్డు